# అమ్మలు

## ప్రతాప వెంకట సుబ్బారాయుడు



సాయంత్రం ఆరు గంటలు.

వేదగిరినగర్ కాలనీలో పని పూర్తిచేసుకున్న నేను కారుని ఇంటిదారి పట్టించాను. పావుగంట ప్రయాణించి కాలనీ దాటబోతున్న నాకు శ్రీకరం గుర్తొచ్చాడు.

ఆఫీసులో శ్రీకరం నాకు రిపోర్టింగ్. సాధారణంగా ఆఫీసుకి ఆలస్యంగానే వస్తూంటాడు. అలా వచ్చినప్పుడల్లా  అతడు చెప్పే కారణాలే ఆసక్తికరంగా వుంటాయి. పెద్ద మాతృభక్తి పరాయణుడికి మల్లె 'అమ్మని ఆస్పత్రికి తీసుకెళ్ళాను' 'అమ్మని గుడికి తీసుకెళ్ళాను' 'అమ్మని నిన్న సాయంత్రం ఫంక్షన్‌కి తీసుకెళ్ళడంతో రాత్రి బాగా పొద్దు పోయింది. పొద్దున్న లేచేసరికి ఆలస్యమయింది. ఇలా వుంటాయి కారణాలు.

శ్రీకరం వుండేది కూడా ఈ కాలనీలోనే! నేనెప్పుడూ వాళ్ళింటికి వెళ్ళలేదు కాని... అడ్రస్ నా దగ్గరుంది. వెళ్తేసరి. అమ్మ వుందో లేక బహానాలు చెబుతున్నాడో తెలిసిపోతుంది.

వాళ్ళింటికి వెళ్ళి తలుపుకొట్టాను. శ్రీకరమే తెరిచాడు. ఎదురుగుండా నుంచున్న నన్నుచూసి ఆశ్చర్యపోయి ''రండిసార్! మీరు రావడం నిజంగా నా అదృష్టం' అని సాదరంగా నన్ను లోపలికి తీసుకెళ్ళి కూర్చోబెట్టి, వాళ్ళావిణ్ణి పిల్లల్ని పరిచయం చేసి కాఫీ, స్నాక్స్ తెమ్మని వాళ్ళావిడకి పురమాయించాడు.

నేను వారించి ''ఈ కాలనీలో వున్న ఫ్రెండింటికి పనిమీద వచ్చాను. అన్నీ అక్కడే పుచ్చుకున్నాను. కేవలం నిన్ను చూద్దామనే మీ ఇంటికి వచ్చాను'' అని ''అందర్నీ పరిచయం చేశావు గాని మీ అమ్మని పరిచయం చేయ లేదేమిటి? ఆవిడ లేరా?'' 'లేరా' అన్నపదాన్ని కాస్తంత వ్యంగ్యం మేళ వించి ఒత్తి పలికాను. క్రీగంట అతని ముఖంలోని భావాలని గమనిస్తూ.

''పదండి సార్ చూపిస్తా'' అని బయటికి నడక సాగించాడు.

'బయటకి తీసుకెళ్తున్నాడేమిటి? లేని అమ్మ మీద సాకులు చెప్పి సెలవులు పర్మిషన్‌లు తీసుకుంటున్నాడు కాబట్టి. అది వాళ్ళావిడకి తెలిసి పోతుందని బయటికి తీసుకొచ్చి నా చేతులు పట్టుకుని 'తప్పయి పోయిందని' బ్రతిమిలాడుకుంటాడేమో?'

బయటకొచ్చాక వాళ్ళింటి పక్కగా వున్న సందులోంచి మరో పెద్ద గది ముందుకు తీసుకెళ్ళి తలుపు తట్టాడు. తలుపు తెరుచుకుంది.

లోపల నలుగురు మహిళలున్నారు. విచిత్రమైన విషయమేమిటంటే సంవత్సరం క్రితం మా ఆవిడ గొడవ పెట్టుకోగా బయటకెళ్ళిపోయిన మా అమ్మ కూడా అక్కడే వుంది.

''సార్! వీళ్ళలో మా అమ్మ కూడా వుంది. కాని ప్రత్యేకంగా ఈవిడ మా అమ్మ అని నాకేనాడూ అన్పించదు. వీళ్ళందరూ మా అమ్మలే! ఒక్క అమ్మ ఉంటేనే మనిషి జన్మ ధన్యమవుతుంది. అలాంటిది నాకింతమంది అమ్మలు. రోజూ నన్ను 'అమ్మ కడుపు చల్లగా' అని వాళ్ళు దీవిస్తుంటే నాకంతకంటే ఇంకేం కావాలి? నా జీతానికి ఇప్పటికి నాకు నలుగురమ్మలు... కాని ఓ రోజొస్తొంది. ఆ రోజు నేను ఎంతోమంది అమ్మల ఒక్కగానొక్క కొడుకునవుతాను'' అన్నాడు ఆనందంగా.

నేను కన్నీళ్ళతో ''ఈవిడ మా అమ్మ. నా నుండి దూరమైన అమ్మని ఏనాడూ వెతికే ప్రయత్నం చేయలేదు. నువ్వు దేముడివి... నీ ఋణం తీర్చుకోలేను'' అన్నాను.

''ఆవిడ మీ అమ్మ అని నాకు తెలియదు. రోజూ మీ గురించి క్షేమ సమాచారాలు అడుగుతుంటే తెలిసినావిడేమో అనుకున్నాను. మీ సుఖం ఆవిడకి అనంత ఆనందం, మీ దుఃఖం ఆవిడకో శోక సముద్రం. కల్మషం లేకుండా పిల్లల ఉన్నతిని కాంక్షించేది తల్లి మాత్రమే! తండ్రి చాటున, మొగుడి చాటున, పిల్లల చాటున తల దాచుకునే స్త్రీని తల్లిలా ఆదరించక పోతే ఇంక ఆవిడకి దిక్కెవరు? మీరే ఆలోచించండి'' అన్నాడు.

నేను మా అమ్మని పొదివి పట్టుకుని ఇంటికి బయల్దేరాను.

*

రచయిత సెల్ నెం: **93939 81918**